విద్యుత్‌ అధికారులకు కొత్త ఫోన్‌ నెంబర్లు

మణికొండ: విద్యుత్‌ శాఖ అధికారుల అధికారిక ఫోన్‌ నెంబర్‌లను సోమవారం నుంచి మార్చుతున్నట్లు డీఈ రమేష్‌చంద్ర తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా బీఎస్‌ఎన్‌ఎల్‌ నుంచి ఎయిర్‌టెల్‌కు తమ ఫోన్‌ నెంబర్‌లు మారుతున్నాయన్నారు. అందులో బాగంగా ఇబ్రహీంబాగ్‌ (నార్సింగి) డీఈఈకి ఫోన్‌: 87124 69551, ఇబ్రహీంబాగ్‌ ఏడీఈకి ఫోన్‌: 87124 69552, మణికొండ ఏఈకి ఫోన్‌: 87124 69557, నార్సింగి ఏఈకి ఫోన్‌: 87124 69550, ఫ్యూజ్‌ ఆఫ్‌ కాల్‌ ఆఫీస్‌కు ఫోన్‌: 97124 69586 నెంబర్లు ఉంటాయని ఆయన వివరించారు.

రేపటి నుంచి మెగా ఉచిత వైద్య శిబిరం

శంషాబాద్‌: శంషాబాద్‌ మున్సిపాలిటీలోని తొండుపల్లి జెడ్పీహెచ్‌ స్కూల్‌లో సోమవారం నుంచి పది రోజుల పాటు మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఏఐజీ ఆస్పత్రి ఆధ్వర్యంలో అన్ని రకాల రోగ నిర్ధారణ పరీక్షలు, మందులు ఉచితంగా చేపట్టనున్నట్లు నిర్వాహకులు పారెపల్లి శ్రీనివాస్‌గౌడ్‌, పెదిరిపాటి ప్రవీణ్‌గౌడ్‌, కొండ ప్రవీణ్‌గౌడ్‌ వెల్లడించారు. వైద్యశిబిరాన్ని పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

ట్రాఫిక్‌ ఆంక్షలు

మైలార్‌దేవ్‌పల్లి: సీసీ రోడ్డు నిర్మాణ పనుల నేపథ్యంలో ట్రాఫిక్‌ ఆంక్షలు విధిస్తున్నట్లు రాజేంద్రనగర్‌ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ రాజేందర్‌గౌడ్‌ తెలిపారు. ఆరాంఘర్‌ వద్ద రైల్వే వంతెన కింద సీసీ రోడ్డు నిర్మాణ పనుల ఈ నెల 19వ తేదీ నుంచి ప్రారంభం అవుతాయన్నారు. దీని కారణంగా దుర్గానగర్‌ నుంచి ఆరాంఘర్‌ వైపు వచ్చే ట్రాఫిక్‌ను ఉదయం 8 గంటల నుంచి 15 రోజుల పాటు కాటేదాన్‌ ఓకేఆర్‌ ద్వారా మళ్లిస్తామన్నారు. ప్రజలు, వాహనదారులు ఈ విషయాన్ని గమనించి ట్రాఫిక్‌ సజావుగా సాగేలా ట్రాఫిక్‌ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

త్రివిధ దళాలకు వందనం



తిరంగా యాత్రకు వెళ్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: దాయాది దేశం పాక్‌పై భారత్‌ నిర్వహించిన ఆపరేషన్‌ సిందూర్‌లో భాగంగా వీరోచిత విన్యాసాలతో శత్రు సైనికుల పీచమణిచిన త్రివిధ దళాల సేవలకు కృతజ్ఞతగా శనివారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌ అంబేడ్కర్‌ విగ్రహం వద్ద నిర్వహించిన తలపెట్టిన తిరంగ యాత్రకు మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ నుంచి బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. బీజేపీ రాజేంద్రనగర్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన చేవెళ్ల పార్లమెంట్‌ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి కాటేదాన్‌లోని బీజేపీ కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున భారీ ర్యాలీగా బయలుదేరి వెళ్లారు.

కొత్వాల్‌గూడ

రహదారికి త్వరలో మోక్షం



రహదారి నిర్మాణానికి రూ. 1.95 కోట్లు మంజూరు

- సాంకేతిక అనుమతి రావడమే ఆలస్యం
- త్వరలో ప్రారంభంకానున్న పనులు
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



కొత్వాల్‌గూడ రహదారి

శంషాబాద్‌: ప్రమాదాలకు నిలయంగా మారిన కొత్వాల్‌గూడ రహదారికి మోక్షం లభించేందుకు మార్గం సుగమమైంది. అస్తవ్యస్తంగా మారిన ఈ రహదారిలో ఇప్పటికే పదుల సంఖ్యలో ప్రజలు ప్రమాదాల బారిన పడటమే కాకుండా ఇటీవల ఓ బాలుడు సైతం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం పాఠకులకు విదితమే.

పంచవటి పార్కు నుంచి...

ఎయిర్‌పోర్టు కాలనీ సమీపంలోని పంచవటి పార్కు నుంచి కొత్వాల్‌గూడ ప్రభుత్వ స్కూల్‌ వరకు రహదారి బాగు కోసం స్థానికులు కొన్నేళ్లుగా ప్రజలు కోరుతూ వస్తున్నారు. పంచాయతీ కాలంలో పంచాయతీ రాజ్‌ శాఖ వేసిన రోడ్డుతోనే నేటికీ ఉండటంతో అస్తవ్యస్తంగా మారింది. మున్సిపాలిటీగా ఏర్పాటై ఏడేళ్ల గడిచినా రహదారి బాగు కోసం గత పాలకవర్గం శ్రద్ధ చూపకపోవడంతో కొత్వాల్‌గూడతో పాటు శంషాబాద్‌, ఎయిర్‌పోర్టు కాలనీవాసులు పలువురు ప్రమాదాల బారిన పడ్డారు. ఒకటిన్నర కిలోమీటరు మేర ఉన్న ఈ రహదారిని బాగు చేయాలని బస్తీవాసులు పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నారు.

నిధులు మంజూరు...

ఏడు మీటర్ల వెడల్పు, ఒకటిన్నర కిలోమీటరు పొడవుతో 15, 16వార్డు పరిధిలో ఉన్న ఈ రహదారి బీటీతో పాటు నీటి ప్రవాహం ఉన్న చోట సీసీ వేసేందుకు ఇటీవల మున్సిపాలిటీ నిర్ణయించింది. ఈ మేరకు నిధులు మంజూరు కూడా జరిగింది. దీనికి సంబంధించిన సాంకేతిక అనుమతి మరో రెండు మూడు రోజుల్లో రానున్నట్లు మున్సిపాలిటీ అధికారులు తెలిపారు. మరో వారం రోజుల్లో రోడ్డు పనులు కూడా చేపట్టేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. శంషాబాద్‌ నుంచి ఎయిర్‌పోర్టు కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ప్రయాణికులకు ఎంతో మేలు జరగనుంది.

త్వరలోనే ప్రారంభిస్తాం

ఒకటిన్నరకక కిలో మీటరుకు పైగా పొడవు, ఏడు మీటర్ల వెడల్పుతో బీటీ, సీసీ రోడ్డుగా వేయడానికి అన్ని ఏర్పాట్లు జరిగాయి. రోడ్డు కోసం రూ. 1.95 కోట్ల నిధులు మంజూరయ్యాయి. రెండుమూడు రోజుల్లో సాంకేతిక అనుమతులు వచ్చే అవకాశం ఉంది. అనంతరం టెండర్‌ ప్రక్రియ పూర్తి చేసి పనులను ప్రారంభించనున్నాం.

- నరేష్‌, శంషాబాద్‌ మున్సిపాలిటీ ఏఈ

నేత్రపర్వంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ టీఎన్‌జీవోస్‌ కాలనీ వెంకన్నగుట్టపై వెలిసిన పద్మావతీ గోదా సమేత సాలాగ్రమ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 16వ తేదీ నుంచి 21వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహిస్తున్నారు. రెండవ రోజు శనివారం ఆరాధన, సేవాకాలం, గోష్టి, బాలభోగం, విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, అరణిమదనం, ద్వారతోరణ దళ్వజకుంభారధన, అగ్నిప్రతిష్ఠ, చకాబ్జమండలారాధన, గరుడ గోష్టి, ధ్వజారోహణం, రాజభోగం శాత్తుమరై పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆరాధన, సేవా కాలం, విష్ణుసహస్రనామ పారాయణం, విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, ద్వారాతోరణధ్వజ కుంభారాధన, నిత్యాహవనం, దేవతాహ్వనం, భేరపూజ, బలిగద్యలు, సాయంకాల నివేదన, శాత్తుమరై తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



స్వామి వారికి పల్లకి సేవ నిర్వహిస్తున్న దృశ్యం



పూజల్లో పాల్గొన్న భక్తులు

నల్లాలకు మోటార్లు బిగిస్తే కేసులు తథ్యం



నలందానగర్‌లో నల్లాకు బిగించిన మోటార్‌ను సీజ్‌ చేస్తున్న అధికారులు

అత్తాపూర్‌: తాగు నీటి వినియోగదారులు తమ కనెక్షన్‌కు మోటారు బిగించి నీటిని తోడితే కేసులు నమోదు చేస్తామని జలమండలి బుద్వేల్‌ సబ్‌ డివిజన్‌ డిప్యూటీ జనరల్‌ మేనేజర్‌ జోహార్‌ అలీ హెచ్చరించారు. శనివారం హైదర్‌గూడ నలందా నగర్‌లో ఓ ఇంట్లో నల్ల కనెక్షన్‌కు బిగించిన మోటార్‌ను తనిఖీలో పట్టుకున్నారు. నల్ల కనెక్షన్‌కు మోటారు పెట్టడం వల్ల పరిసర ప్రాంతాల వినియోగదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో నీటి సరఫరా సక్రమంగా జరిగేలా తనిఖీలు చేస్తున్నామన్నారు. తనిఖీల్లో జావిద్‌, పంప్‌ ఆపరేటర్‌ అఖిలేష్‌, వెంకటేష్‌ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం

మణికొండ: పేద ప్రజలను అన్ని విధాలా ఆదుకునేందుకు తన వంతు సహాయ సహకారాలను అందించే విషయంలో తాను ఎల్లవేళలా ముందుంటానని వట్టినాగులపల్లి మాజీ సర్పంచ్‌ జి.స్వరూప నగేష్‌యాదవ్‌ అన్నారు. శనివారం ఆమె వట్టినాగులపల్లి గ్రామానికి చెందిన పోచమ్మ మనువరాలి వివాహానికి రూ. 21 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా స్వరూప మాట్లాడుతూ... ఇప్పటి వరకు వంద మందికి పైగా యువతీ యువకుల వివాహాలకు ఆర్థిక సాయం అందించామన్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం సాయం చేశామని, రాబోయే రోజుల్లోనూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. అవసరమైన వారు తమను సంప్రదించవచ్చన్నారు.



ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న మాజీ సర్పంచ్‌ స్వరూప

నాలాలను శుభ్రం చేయాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

బండ్లగూడ: వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో కార్పొరేషన్‌ పరిధిలోని నీటి కాలువలు, నాలాలు, మురికినీటి కాలువలను శుభ్రపరచడాని ఆల్‌ కాలనీస్‌ ఫెడరేసన్‌ ఆఫ్‌ బీజేఎంసీ సభ్యులు కోరారు. ఈ మేరకు కార్పొరేషన్‌ కమిషనర్‌ శరత్‌చంద్రకు శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పేరుకుపోయిన చెత్త, బురద అడ్డంకులకు కారణమవుతున్నాయన్నారు. దీని వల్ల నీరు రోడ్ల మీదకి పొంగిపొర్లడం, దుర్వాసనలు వస్తున్నాయన్నారు. అంతేకాకుండా దోమల వృద్ధికి దారితీస్తున్నాయన్నారు. ముందస్తుగా శుభ్రపరచడం వల్ల నీటి ప్రవాహం సజావుగా ఉంటుందన్నారు. ఆరోగ్య ప్రమాదాలను నివారిస్తుందన్నారు. పరిశుభ్రమైన వాతావరణాన్ని ఇస్తుందన్నారు. త్వరలో పూడిక తీత పనులను చేపడతామని కమిషనర్‌ హామీ ఇచ్చారన్నారు. నేతలు వినయ్‌రెడ్డి, నదీమ్‌, నరేందర్‌ బాబు, హరీష్‌గౌడ్‌, నవీన్‌, మహేందర్‌రెడ్డి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

20న శంషాబాద్‌లో తిరంగా ర్యాలీ



కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు రాజ భూపాల్‌ గౌడ్‌ తదితరులు

రాజేంద్రనగర్‌: ఆపరేషన్‌ సిందూర్‌ విజయోత్సవంగా కొనసాగిన నేపథ్యంలో ఈ నెల 20వ తేదీన శంషాబాద్‌లో తిరంగా ర్యాలీని నిర్వహించనున్నారు. పట్టణంలోని అంబేద్కర్‌ విగ్రహం వద్ద ప్రారంభమయ్యే ర్యాలీ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు రాజ భూపాల్‌ గౌడ్‌ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం బీజేపీ రాజేంద్రనగర్‌ డివిజన్‌ అధ్యక్షుడు సందీప్‌ ముదిరాజ్‌ అధ్యక్షతన రాజేంద్రనగర్‌ డివిజన్‌ మీటింగ్‌ పీఆర్‌ ప్యాలెస్‌లో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్‌ గౌడ్‌, రాజేంద్రనగర్‌ డివిజన్‌ ప్రభారి ప్రభాకర్‌ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్‌ మల్లేష్‌ యాదవ్‌, రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ ముదిరాజ్‌, వాసు, హరికిషన్‌ జీ, సోల్కర్‌ రెడ్డి, విట్టల్‌, కీర్తి, శ్రీను, మల్లేష్‌ చారి, స్వప్నా రెడ్డి, సరితా రెడ్డి, రజనీకాంత్‌గుప్తా, రాజశేఖర్‌ రెడ్డి, మహేశ్‌ ముదిరాజ్‌, రవీందర్‌ రెడ్డి, విజయ్‌ యాదవ్‌, జయప్రకాశ్‌ రెడ్డి, చంద్రశేఖర్‌ రెడ్డి, లడ్డూ, కరుణాకర్‌ రెడ్డి, చంద్ర గౌడ్‌, శశిధర్‌ తదితరులు పాల్గొన్నారు.

డెలివరీ బాయ్‌పై దాడి?



బాధితుడు నజీం.. చేతిపై ఉన్న గాయాలు

అత్తాపూర్‌: ఆర్డర్‌ ఇచ్చిన వస్తువులను అందించేందుకు వెళ్లిన డెలివరీ బాయ్‌పై ఐదుగురు వ్యక్తులు దాడి చేసిన సంఘటన అత్తాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో శనివారం రాత్రి జరిగింది. స్థానికుల సమాచారం మేరకు... చింతల్‌మెట్‌ లోకేషన్‌లో జిప్టో యాప్‌ ద్వారా కొన్ని వస్తువులను డెలివరీ చేయాలని ఆర్డర్‌ ఇచ్చారు. వారి డెలివరీ ఆర్డర్‌ ఇచ్చేందుకు వెళ్లిన నజీం అనే డెలివరీ బాయ్‌పై ఐదుగురు పెప్పర్‌ స్ప్రేను జల్లి దాడి చేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులకు బాధితుడు తనపై స్ప్రే దాడి చేసి డబ్బు, ఫోన్‌, ద్విచక్ర వాహనం కీ లాక్కున్నారని తెలిపాడు. అతని చేతులపై బ్లేడ్‌తో దాడి చేయటంతో రక్తపు మరకలను పోలీసులకు చూయించాడు. ఇదిలా ఉండగా పోలీసులు మాత్రం ఇతర వ్యక్తులు అతనిపై దాడి చేశారనే ఆరోపణకు రుజువులు లభించలేదని భావిస్తున్నారు. అతని ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నామని స్పష్టం చేశారు.

రోడ్డుపైనే వ్యాపారాలు

గోల్కొండ: గుడిమల్కాపూర్‌ లక్ష్మీనగర్‌ చౌరస్తా అక్రమ పార్కింగ్‌లు, వ్యాపారాలకు నిలయంగా మారింది. రేతిబౌలి నుంచి శంషాబాద్‌ వెళ్లే పీవీఎన్‌ఆర్‌ ఎక్స్‌ప్రెస్‌వే పక్కనే ఉన్న ఈ చెరువు రోడ్డుకు అన్ని వైపులా తోపుడు బండ్లు, కూరగాయల వ్యాపారులు ఆక్రమించుకున్నారు. దీంతో ఈ చౌరస్తా అత్యంత రద్దీగా మారింది. మరోవైపు చౌరస్తాను ఆనుకొని ఉన్న ఓ ఇరానీ హోటల్‌ ముందు ద్విచక్రవాహనాలు అక్రమంగా పార్కు చేసి ఉంటున్నాయి. రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారికి చెక్‌ పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కార్పొరేట్‌కు దీటుగా వైద్యం

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రి కార్పొరేట్‌ ఆస్పత్రులకు దీటుగా వైద్య సేవలు అందిస్తున్నామని మెడికల్‌ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ పి.వి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం కాంగ్రెస్‌ నేత పరామానందం ఆధ్వర్యంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్‌ శ్రీనివాసరావు మాట్లాడుతూ... ఆస్పత్రికి రోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నదన్నారు.

సౌర విద్యాలయాలు

విద్యుత్‌ ఆదా, పొదుపు చర్యల్లో భాగంగా ఏర్పాటు



రాయదుర్గం: నగర శివారు ఐటీకారిడార్‌ ప్రాంత పరిసరాల్లోని పలు ఉన్నత విద్యాసంస్థల్లో సోలార్‌ వెలుగులు విరజిమ్ముతున్నాయి. సౌర విద్యాలయాలుగా మారాయి. శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి, టెలికామ్‌నగర్‌ పరిధిలోని జాతీయ స్థాయి విద్య, శిక్షణా సంస్థలలో సోలార్‌ విద్యుత్‌ ఉత్పత్తికి శ్రీకారం చుట్టాయి. విద్యుత్‌ వ్యయాన్ని గణనీయంగా తగ్గించేందుకు.. క్యాంపస్‌లలో పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించుకునేందు ముందుకుసాగుతున్నాయి. భవిష్యత్‌లో పూర్తిగా సౌరవిద్యుత్‌ వాడడానికి ఆలోచిస్తున్నారు.

- టెలికామ్‌నగర్‌లోని నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టూరిజమ్‌ అండ్‌ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌ (నిథమ్‌)
- గచ్చిబౌలిలోని హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)
- గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్‌ స్టాఫ్‌ కాలేజ్‌ ఆఫ్‌ ఇండియా
- టెలికామ్‌నగర్‌లోని మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం
- ఎస్కీలో ఖాళీ స్థలంలో కూడా సోలార్‌ ప్యానల్స్‌ ఏర్పాటు చేసి విద్యుత్‌ ఉత్పత్తి చేస్తున్నారు.

నిథమ్‌లో...

- నిథమ్‌లో 35వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో 200 కిలోవాట్ల సామర్థ్యం.. సోలార్‌ విద్యుత్‌ ఉత్పత్తిని ప్రారంభించారు.

ఇంజనీరింగ్‌ స్టాఫ్‌ కాలేజ్‌ ఆఫ్‌ ఇండియాలో...

- క్యాంపస్‌లోని అకడమిక్‌ బ్లాక్‌ భవనం రూఫ్‌టాప్‌పై 60 కిలోవాట్లు, హాస్పిటాలిటీ బ్లాక్‌ భవనంపై 100 కిలోవాట్లు, బాలుర హాస్టల్‌ భవనం -1పై 15 కిలోవాట్లు, బాలుర హాస్టల్‌ భవనం -2పై 25 కిలోవాట్ల సోలార్‌ ప్యానల్స్‌ ఏర్పాటు చేశారు.
- వీటి ద్వారా 140 నుంచి 150 కిలోవాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు.
- దీనికోసం రూ.93 లక్షల వ్యయం చేశారు. ఈ సోలార్‌ పవర్‌తో నెలకు రూ.2.50 లక్షల విద్యుత్‌ బిల్లు ఆదా చేస్తున్నారు.
- క్యాంపస్‌కు రోజుకూ 900 యూనిట్ల విద్యుత్‌ అవసరం కాగా సోలార్‌ ద్వారా 1200 యూనిట్ల ఉత్పత్తికి ప్రణాళికలు చేశారు. అదనపు విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయించాలని భావిస్తున్నారు.

ఎస్కీలో...

- గచ్చిబౌలిలోని ఈఎస్‌సీఐలో సోలార్‌ పివి గ్రిడ్‌ ఆఫ్‌ 20 కెడబ్ల్యూపి ఇంటరాక్టివ్‌ పవర్‌ ప్లాంట్‌ను 2015లో ప్రారంభించారు.
- క్యాంపస్‌లోని కౌటిల్య, చాణిక్య భవనాల అవసరాలను తీర్చడానికి సోలార్‌ పవర్‌ను వినియోగిస్తున్నారు.
- 2015లో 80 కెడబ్ల్యూపీ ఇంటర్యాక్టివ్‌ పవర్‌ ప్లాంట్‌ మరో గ్రిడ్‌ను ప్రారంభించారు.

హెచ్‌సీయూలో..

- హెచ్‌సీయూలో మొదట 1.140 మెగావాట్ల సౌర విద్యుత్తును ఉత్పత్తి చేశారు.
- విద్యుత్‌ బిల్లు నెలకు రూ. 14 లక్షల వ్యయం తగ్గింది. 15 శాతం విద్యుత్‌ అవసరాలు తీరుతున్నాయి
- భవిష్యత్తులో 5 మెగావాట్ల సౌర విద్యుత్‌ ఉత్పత్తికి 2 మెగావాట్ల చొప్పున రెండు దశల్లో సామర్థ్యాన్ని పెంచాలని తాజాగా ప్రతిపాదించారు.
- ఇందిరాగాంధీ మెమోరియల్‌ లైబ్రరీపై 100 కేవీ సోలార్‌ పవర్‌ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు.



- క్యాంపస్‌లోని పరిపాలనా భవనం, డైనింగ్‌ హాల్‌, కన్సల్టెన్సీ విభాగం విద్యుత్‌ అవసరాలను తీరుస్తున్నారు.

ఉర్దూ విశ్వవిద్యాలయంలో...

- గచ్చిబౌలిలోని టెలికామ్‌నగర్‌లో 200 ఎకరాల్లో విస్తరించిన మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం సోలార్‌ పవర్‌పై దృష్టిపెట్టింది.
- 'మనూ'లో ప్రస్తుతం 500 కేవీఏ విద్యుత్‌ అవసరం. దశలవారీగా పూర్తిగా సౌర విద్యుత్‌ వాడాలని సంకల్పించారు.
- వీసీ ప్రొఫెసర్‌ సయ్యద్‌ ఐనుల్‌ హసన్‌ 2022లో సోలార్‌పవర్‌ ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు .
- ఆన్‌ గ్రిడ్‌ మోడ్‌లో 100 కేవీఏ సామర్థ్యం గల సౌర ఫలకాలను ఏర్పాటు చేశారు. మలివిడతలో మిగతా భవనాలపై ఏర్పాటు చేయాలని సంకల్పించారు.

పర్యాటక ప్రాంతాలు కిటకిట



గోల్కొండ: పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు కావడంతో పర్యాటక ప్రాంతాలు రద్దీగా మారాయి. సెవన్‌ టూంబ్స్‌లోని కుతుబ్‌షాహీ రాజుల సమాధుల ప్రాంగణం, గోల్కొండ కోట, తారామతి బారదారి తదితర ప్రాంతాలు ప్రతినిత్యం వేలాది మంది పర్యాటకులతో కళకళలాడుతున్నాయి. సుందరీకరణ పూర్తి చేసుకున్న కుతుబ్‌షాహీ రాజుల సమాధులు పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మరోవైపు దక్షిణ భారతదేశంలోనే అత్యంత ప్రతిష్ఠమైన కోటగా పేరొందిన గోల్కొండ కోటకు వేలాది మంది పర్యాటకులు తరలివస్తున్నారు. భారీ సంఖ్యలో వచ్చే పర్యాటకులతో గోల్కొండ కోట ఎదురుగా ఉన్న ఇరానీ హోటల్స్‌, రెస్టారెంట్లు కిటకిటలాడుతున్నాయి.

ఆషూర్‌ఖానాల వద్ద సమస్యల పరిష్కారానికి చర్యలు



యాకుత్‌పురా: మజ్లిస్‌ పార్టీ ఎమ్మెల్సీగా రెండవ సారి ఎన్నికైన మీర్జా రియాజుల్‌ హసన్‌ అఫాందీ ఎమ్మెల్యే జాఫర్‌ హుస్సేన్‌ మేరాజ్‌ శనివారం స్థానిక కార్పొరేటర్లతో కలిసి ఆషూర్‌ఖానాలను సందర్శించారు. యాకుత్‌పురా, రెయిన్‌ బజార్‌, మౌలాక చిల్లా, బడాబజార్‌, షౌకాత్‌ జంగ్‌ దేవిడి తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రానున్న మొహర్రం సంతాప దినాలను పురస్కరించుకొన్ని ఆషూర్‌ఖానాల వద్ద నెలకొన్న సమస్యల పరి ష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆషూర్‌ఖాలో మజ్లిస్‌, మాతం నిర్వహించేందుకు వచ్చే వారికి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లను చేయాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో రెయిన్‌ బజార్‌, డబీర్‌పురా కార్పొరేటర్లు మహ్మద్‌ వసీవుద్దీన్‌, అలందర్‌ వాలా జహ, మజ్లిస్‌ పార్టీ ఏరియా కమిటీ అధ్యక్షులు, జీహెచ్‌ఎంసీ, జలమండలి విభాగాల అధికారులు పాల్గొన్నారు.